ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల

జిల్లా వార్తలు

3★★★

సోమవారం 11 మార్చి 2024

విద్యుదాఘాతంతో రైతు మృతి 4

6 సావిత్రీబాయి పూలేకు ఘన నివాళి



గ్యారంటీలకు దరఖాస్తు చేసుకుంటున్న ప్రజలు

నెరవేరనున్న సొంతింటి కల

- ఇందిరమ్మ ఇళ్లకు 1.10 లక్షల దరఖాస్తులు
- మొదటి దశలో సొంత స్థలం ఉన్నవారికి ప్రాధాన్యం
- విడతల వారీగా రూ.5 లక్షలు
- సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాలకు తొలి విడతలో 7 వేల ఇళ్లు
- గత ప్రభుత్వ హయాంలో జిల్లాకు 6886 డబుల్ బెడ్‌రూం ఇళ్ల మంజూరు
- పూర్తయినవి 3546 ఇళ్లు
- ఆరు గ్యారంటీల్లో నేడు ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

గూడు లేని పేదల సొంతింటి నెరవేరనుంది. ఆరు గ్యారంటీల్లో భాగంగా కొత్త ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టనుంది. సోమవారం భద్రాచలంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పథకాన్ని ప్రారంభించనున్నారు. తొలి దశలో సొంతంగా స్థలం ఉండి ఇంటి నిర్మించుకోవడానికి రూ.5లక్షలు విడతల వారీగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఆ తరువాత సొంతంగా ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇందిరమ్మ కాలనీలను ఏర్పాటు చేయనుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలకు రాజన్న సిరిసిల్ల జిల్లాలో 1,92,617 మంది దరఖాస్తు చేసుకోగా ఇందిరమ్మ ఇళ్ల కోసం 1,10,198 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరితోపాటు ఇంటి స్థలాల కోసం అమరవీరుల కుటుంబాలు 338, తెలంగాణ ఉద్యమకారులు 2130 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో తొలి విడతలో స్థలం ఉన్నవారికి రూ.5 లక్షలు అందించనున్నారు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ రెండు నియోజకవర్గాలకు సంబంధించి తొలి విడతలో 7 వేల ఇళ్లకు మంజూరు ఇచ్చారు. ఒక్కో నియోజకవర్గానికి 3500 చొప్పున ఏడాదిలో ఇందిరమ్మ ఇళ్లను పూర్తి చేయనున్నారు. ప్రస్తుతం 400 చదరపు అడుగుల్లో ఇళ్లు నిర్మించుకోవడానికి నాలుగు విడతల్లో అందించే ఆర్థిక సహాయంలో మొదట బేస్‌మేంట్ స్థాయిలో రూ.లక్ష, పైకప్పునకు రూ.లక్ష, గోడల నిర్మాణం పూర్తయిన తరువాత రూ.2 లక్షలు, నిర్మాణం మొత్తం పూర్తయిన తరువాత మరో లక్ష రూపాయలు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఎలాంటి ఇల్లులేని తెల్లరేషన్ కార్డు ఉన్న నిరుపేదలను ఈ పథకానికి అర్హులుగా ప్రకటించారు. గుడిసెలు, మట్టిగోడల ఇల్లున్న వారిని ఇందిరమ్మ పథకానికి అర్హులుగానే గుర్తించారు. గత ప్రభుత్వం హయాంలో గృహలక్ష్మీ పథకం పేరిట ప్రతీ నియోజకవర్గానికి 3 వేల ఇళ్లు మంజూరు చేశారు. కొందరికి ప్రొసీడింగ్‌లు అందించినా ఎన్నికల కోడ్‌తో పథకం అందకుండా పోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు ప్రకటించడంతో లబ్ధిదారుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు అందనున్నాయి. ఇందులో భాగంగానే నియోజకవర్గానికి 3500 ఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం అందించనుంది.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల పరిస్థితి ఏమిటో?

గత ప్రభుత్వం పేద కుటుంబాలకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలను చేపట్టింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో కొన్ని చోట్ల నిర్మాణాలు పూర్తి చేసి కేసీఆర్ కాలనీల పేరిట ప్రారంభించారు. కొన్ని చోట్ల ఇప్పటికీ నిర్మాణాలు పూర్తికాక వెక్కిరిస్తున్నాయి. చివరి దశకు వచ్చిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు పంపిణీకి నోచుకోలేదు. కొత్త ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లపై ఎలాంటి నిర్ణయం తీసుకోబోతోందనే అయోమయం నెలకొంది. డబుల్ బెడ్‌రూం ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులను ఎంపిక చేసినా అందించలేకపోయారు. జిల్లాలో 13 మండలాలకు సంబంధించి 6886 డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేశారు. రూ.374.41 కోట్లు ఇందుకోసం నిధులు వ్యయంగా నిర్ణయించారు. ఇందులో 5437 ఇళ్లకు మాత్రమే టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు. 4248 ఇళ్ల నిర్మాణాలు చేపట్టి, 3546 పూర్తి చేశారు. ఇప్పటి వరకు 3448 ఇళ్లు లబ్ధిదారులకు అందించారు. రూ.188.49 కోట్లు ఖర్చు చేశారు. 702 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. కొన్ని ఇళ్లు దాదాపు పూర్తయినా మౌలిక సదుపాయాలు లేక పంపిణీకి నోచుకోవడం లేదు. కొన్ని పూర్తయినా అందించడం లేదు. జిల్లాలో సిరిసిల్ల మండలంలో 2052 ఇళ్ల లక్ష్యాన్ని పూర్తి చేశారు. ముస్తాబాద్‌లో 702 ఇళ్లకు 429, తంగళ్లపల్లిలో 549 ఇళ్లకు 110, ఎల్లారెడ్డిపేట 490 ఇళ్లకు 320, గంభీరావుపేట 476 ఇళ్లకు 371, వీర్నపల్లి 160 ఇళ్లు మంజూరవగా 50 ఇళ్ల నిర్మాణం ప్రారంభించగా ఒకటి కూడా పూర్తి కాలేదు. ఇల్లంతకుంటలో 340 ఇళ్లకు 184 పూర్తి చేశారు. వేములవాడ



వేములవాడలో నిలిచిపోయిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు

రూరల్ మండలంలో 1080 ఇళ్లకు 80 పూర్తవగా వేములవాడ అర్బన్‌లో 800 ఇళ్లకు ఇప్పటి వరకు ఒకటి కూడా పూర్తి కాలేదు. కోనరావుపేట మండలంలో 92, చందుర్తి 45, రుద్రంగి 35, బోయినపల్లిలో 65 ఇళ్లు మంజూరైనా ఇప్పటి వరకు నిర్మాణాలు ప్రారంభం కాలేదు. ప్రధానంగా వేములవాడ నియోజకవర్గంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పూర్తిగా నిరాశనే కల్పించింది. గత ప్రభుత్వంలో ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతోనే సగం కూడా పూర్తి కాలేదనే విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం మంజూరైనా ఇళ్లలో ఇప్పటివరకు ప్రారంభంకానివి ముస్తాబాద్‌లో 175 ఇళ్లు, తంగళ్లపల్లి 178, ఎల్లారెడ్డిపేట 106, గంభీరావుపేట 43, వీర్నపల్లి 87, ఇల్లంతకుంట 156, వేములవాడ రూరల్ 1000, వేములవాడ అర్బన్ 656, కోనరావుపేట 92, చందుర్తి 45, రుద్రంగి 35, బోయినపల్లిలో 65 ఇళ్లు టెండర్లు పూర్తయ్యాయి. వీటి పరిస్థితిపై కూడా ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోబోతోందనే ఆసక్తి నెలకొంది.

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆహ్వానం

ఎల్లారెడ్డిపేట, మార్చి 10: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలోని దుర్గమ్మ ఆలయ పునఃప్రతిష్ఠాపన ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ ఆలయ కమిటీ సభ్యులు మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు కరీంనగర్‌లో ఆదివారం ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 20 వరకు వేడుకలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నాయకులు సాహెబ్, శ్రీనివాస్‌రెడ్డి, బాలయ్య, చంద్రం, లింగం, లక్ష్మణ్, సుదర్శన్ తదితరులు ఉన్నారు.

రాణీప్రసాద్‌కు ఉమెన్ ఐకాన్ అవార్డు



అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు

సిరిసిల్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బాల సాహిత్యంలో విశేషంగా కృషి చేస్తున్న సిరిసిల్లకు చెందిన బాలసాహితీవేత్త డాక్టర్ కందేపి రాణీప్రసాద్‌కు ఉమెన్ ఐకాన్ అవార్డును అందించి సత్కరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం రాత్రి హైదరాబాద్‌లో పొట్టి శ్రీరాములు యూనివర్సిటీలోని ఆడిటోరియంలో అంతర్జాతీయ ఫిలాన్ త్రోపిక్ సొసైటీ వివిధ రంగాల్లోవారికి ఉమెన్ ఐకాన్ అవార్డులు ప్రకటించారు. ఇందులో భాగంగా బాల సాహిత్యంలో రాణీప్రసాద్‌కు ఎమ్మెల్సీ సురభి వాణీదేవి ఉమెన్‌ఐకాన్ అవార్డును అందజేశారు. అవార్డు అందుకున్న సందర్భంగా ఆదివారం సిరిసిల్లలోని జిల్లా రచయితల సంఘం, మానేరు రచయితల సంఘం, కవులు, రచయితలు అభినందనలు తెలిపారు.

ఘనంగా బద్ది పోచమ్మ బోనాలు



బోనాలను తీసుకెళ్తున్న మహిళలు

రుద్రంగి, మార్చి 10: రుద్రంగి మండలం మానాలలో బద్ది పోచమ్మ అమ్మవారి బోనాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏటా శివరాత్రి జాతర తెల్లవారు బద్ది పోచమ్మ బోనాలు తీయడం ఆనవాయితీ. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పిసరి చిన్న భూమయ్య, మాజీ సర్పంచ్ అల్లూరి మానస, నాయకులు జక్కు మోహన్, బాదనవేణి రాజరాం, జక్కు వంశీ, రవీందర్, దిలీప్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వన్య ప్రాణుల కోసం నీటి తొట్టెల ఏర్పాటు



నీరు పోస్తున్న అధికారులు

కోనరావుపేట, మార్చి 10: వేసవిలో ఎండలు ముదురుతున్న నేపథ్యంలో అడవి జంతువులు జనవాసంలోకి వచ్చి పలు ప్రమాదాల బారిన పడుతున్నాయి. ఈ మధ్యనే ఓ దుప్పి బావిలో పడిపోయింది. మరో దుప్పి దాహార్తి కోసం జనవాసంలోకి రావడంతో కుక్కలు దాడి చేశాయి. వన్యప్రాణులను కాపాడడానికి అటవీశాఖ అధికారులు అటవీ ప్రాంతాల్లో నీటి తొట్టెలను ఏర్పాటు చేస్తున్నారు. కోనరావుపేట మండలం శివంగాలపల్లి అటవీ ప్రాంతంలో నీటి తొట్టెలను ఏర్పాటు చేసి ట్యాంకర్ల ద్వారా నీరు పోరుస్తున్నారు.

మినీ స్టేడియం పరిశీలన

ఎల్లారెడ్డిపేట, మార్చి 10: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూ.80 లక్షల నిధులతో చేపట్టనున్న మినీ స్టేడియం, అంసపూర్తిగా ఉన్న తరగతి గదుల నిర్మాణ పనుల ప్రారంభానికి స్థానిక నాయకులు ఆదివారం పరిశీలించారు. మండల కేంద్రంలోని అద్దె భవనంలో కొనసాగుతున్న మహాత్మాజ్యోతిబా పూలే డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనం నిర్మించేందుకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అసంపూర్తిగా ఉన్న గదులను పరిశీలించామన్నారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి విద్యార్థుల సమస్యను పరిష్కరిస్తామన్నారు. నాయకులు బాలరాజుయాదవ్, గిరిధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్ గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రమేశ్, తిరుపతి తదితరులు ఉన్నారు.

రైతు కుటుంబాలను ఆదుకుంటాం





పరామర్శిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ అరుణ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కోనరావుపేట, మార్చి 10: కోనరావుపేట మండలం బావుసాయిపేటలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన పంబాల భూమయ్య కుటుంబాన్ని, మిగతా రైతు కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మృతి చెందిన పంబాల భూమయ్య కుటుంబ సభ్యులతోపాటు, గాయపడిన పంబాల రాజు, కర్నాల మహేష్, తుపాకుల శ్రీనివాస్‌ను వేములవాడ ఏరియా ఆస్పత్రిలో పరామర్శించారు. బోరు దించుతున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి పంబాల భూమయ్య మృతి చెందాడని, గాయపడిన ముగ్గురిని ఆదుకుంటామని అన్నారు. విద్యుదాఘాతానికి గురైన వారిని వేములవాడ ఏరియా ఆసుపత్రిలో జడ్పీ చైర్ పర్సన్ అరుణా రాఘవరెడ్డి, ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, కరీంనగర్ మాజీ జడ్పీ చైర్ పర్సన్ తుల ఉమ, సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి పరామర్శించారు.



వంశీకృష్ణకు అవార్డు అందజేస్తున్న అందెశ్రీ

పాటలోని కవిత్వానికి నష్టం

- ప్రముఖ కవి అందెశ్రీ

సిరిసిల్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జయ జయహే తెలంగాణ పాటకు పట్టం కట్టారని, అదే పాట రీతిలో ప్రతీ కలం నుంచి జాలువారిన పాట పరుగెత్తాలని, కానీ పాటలోని కవిత్వానికి నష్టం జరుగుతోందని ప్రముఖ కవి అందెశ్రీ ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని రంగినేని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏటా జాతీయ స్థాయిలో ఇచ్చే రంగినేని ఎల్లమ్మ సాహిత్య పురస్కారం-2023ను వరంగల్ జిల్లాకు చెందిన కవి వంశీకృష్ణ రాసిన రెప్ప వాలని రాత్రి కవితా సంపుటికి ఎంపికవగా ఆదివారం ఈనాడు సంపాదకుడు డీఎస్ ప్రసాద్ అందజేశారు. ఈ సందర్భంగా అందెశ్రీ మాట్లాడుతూ ఏ పాట ప్రాణ ప్రతిష్ఠ అయ్యిందో, ఏ పాట తనకు చిరునామా అయ్యిందో, ఏ పాట ఇంతవాడిని చేసి మీ ముందు నిలబెట్టిందో ఆ పాటకు పదేళ్లు ఎంతటి అవమానం జరిగిందో తెలియనిది కాదన్నారు. పాటను కవిత్వం అనడానికి మనుషులకు మరుగుజ్జుతనంగా ఉందన్నారు. కవులు అనేక పాయలుగా విడిపోతున్నారన్నారు. బతుకుదెరువు కోసం ఏది ఎంచుకున్నా లోకైకంగా ఆలోచించే విధంగా కవిత్వం రావాలన్నారు. రంగినేని ట్రస్ట్ అనాథలను చేరదీయడం ఆనందాన్ని ఇస్తోందన్నారు. ఈనాడు సంపాదకుడు డీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో ఉన్నన్ని వనరులు ప్రపంచంలో ఏదేశంలో లేవన్నారు. కానీ ప్రకృతి అందించే 93 శాతం సంపద 7 శాతం వారి వద్దనే ఉందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, అఖిలభారత తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు జూకంటి జగన్నాథం, రంగినేని ఎల్లమ్మ పురస్కార కమిటీ కన్వీనర్ మద్దికుంట లక్ష్మణ్, రంగినేని ట్రస్ట్ అధ్యక్షుడు రంగినేని మోహన్‌రావు, రచయిత ఎం.నారాయణశర్మ, ట్రస్ట్ కోశాధికారి నవీన్‌కుమార్, రచయిత గరిపెల్లి అశోక్ పాల్గొన్నారు.



హాజరైన కవులు, రచయితలు

అన్ని రంగాల్లో అభివృద్ధికి పెద్దపీట

ముస్తాబాద్, మార్చి 10 : అన్ని రంగాల్లో అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేయనున్నట్లు పార్టీ ముస్తాబాద్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని నామాపూర్‌లో మల్లికార్జున ఆలయం వద్ద సీసీ రోడ్డు పనులకు ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జ్ కేకే మహేందర్‌రెడ్డి రూ.10లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల విడుదలకు కృషి చేశారన్నారు. ఆలయం వద్ద సీసీ రోడ్డు, మెట్లను నిర్మించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ గుండం నర్సయ్య, ఎంపీటీసీ చిట్టబోయిన లలితా దేవేందర్, మాజీ ఏఎంసీ చైర్మన్ చిట్నేని అంజనేయరావు, ఆలయ కమిటీ చైర్మన్ ఎలుసాని దేవయ్య, సల్కం ఎల్లం, కొరెడ్ల కొండల్‌రెడ్డి, కొండం రాజిరెడ్డి, మిరుదొడ్డి భాను, బాలరాజు యాదవ్, రమేశ్, కుమార్‌యాదవ్, రాజయ్య, శ్రీనివాస్ యాదవ్, మల్లేశ్‌యాదవ్, దేవేందర్, అనిల్ పాల్గొన్నారు.

ట్యాంకర్లతో పంటకు సాగు నీరు



ట్యాంకర్‌తో నీళ్లుపోస్తున్న రైతులు

సిరిసిల్ల రూరల్, మార్చి 10: అరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలు చేతికి వచ్చే సమయంలో సాగు నీరు లేక ఎండిపోతుండడంతో కాపాడుకోవడానికి రైతులు అవస్థలు పడుతున్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్‌లో శివారులోని భవానీ కుంట, మైసమ్మ చెరువు, కొత్త చెరువులు నీళ్లు లేక ఎండిపోయాయి. వాటికింద ఉన్న బోర్లు, వ్యవసాయ బావుల్లో నీళ్లు అడుగంటిపోయాయి. దీంతో వాటిపై ఆధారపడి పంటలను సాగుచేసిన రైతులు పంటలను కాపాడుకోవడానికి తిప్పలు పడుతున్నారు. ఆదివారం గ్రామానికి చెందిన జీల కిషన్ యాదవ్, రాజేందర్, నర్సయ్యతోపాటు మరికొంత మంది రైతులు రూ.3వేలు వెచ్చించి ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి పంటలకు అందించారు. సాగు నీరు లేక పంటలు ఎండిపోతుండడంతో ట్యాంకర్ల ద్వారా కొనుగోలు చేస్తున్నామని, పంటలను కాపాడుకోవడానికి ప్రయత్నం చేస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వస్త్ర పరిశ్రమ బంద్‌తో పస్తులుంటున్న కార్మికులు

సిరిసిల్ల రూరల్, మార్చి 10 : సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమలు బంద్ చేయడంతో కార్మికులు పస్తులుంటున్నారని, వారికి రాష్ట్ర ప్రభుత్వం ఉపాధిని కల్పించాలంటూ సోమవారం సిరిసిల్లలో కార్మికులతో కలిసి రాస్తారోకో చేయనున్నామని సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్ ప్రకటించారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాలు, మరమగ్గాలు, వార్పిన్, వైపని, ఆసాములు, జాఫర్‌లు, గుమస్తాలు, కండెలు చుట్టే కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో చేపట్టనున్నట్లు చెప్పారు. వార్పిన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సత్యం, సంఘం నాయకులు సంపత్, పవర్‌లూం వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు దేవదాస్, సురేష్, కనుకయ్య తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజుల్లో పంటలకు బోనస్ ప్రకటించాలి

- బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్



సావిత్రీబాయిపూలే చిత్ర పటం వద్ద నివాళి అర్పిస్తున్న కేటీఆర్

గంభీరావుపేట, మార్చి 10: రేవంత్‌రెడ్డికి రైతుల మీద నిజంగా ప్రేమ ఉంటే మూడు రోజుల్లో క్వింటాల్‌కు రూ.500 బోనస్ జీవో విడుదల చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ డిమాండ్ చేశారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని గాయత్రి ఫంక్షన్ హాల్‌లో మండల స్థాయి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ముందుగా సావిత్రీ బాయిపూలే చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ రేవంతరెడ్డి నిజాయితీ గల్ల మోసగాడని, లొడ లొడ నీతిలేని మాటలు మాట్లాడుతున్నాడని, ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే తెలంగాణ ప్రజలే బొందపెడుతారని అన్నారు. కోటి 67 లక్షల ఆడబిడ్డలకు రూ.2500, 46 లక్షల మంది వృద్ధులకు రూ.4వేల పింఛన్ అందజేయాలన్నారు. డిసెంబరు 9న చేస్తానన్నా రూ.2 లక్షల పంట రుణమాఫీ ఏమైందని ప్రశ్నించారు. వంద రోజుల్లో ఇచ్చిన హామీలు చేయకుంటే తెలంగాణ ప్రజలే బొంద పెడుతారన్నారు.

రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ముఖ్యమంత్రి కాదు

రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ముఖ్యమంత్రి కాదని, త్వరలో రాహుల్ గాంధీకి వెన్నుపోటు పొడవడం ఖాయమని కేటీఆర్ అన్నారు. పార్లమెంటు ఎన్నికల తరువాత బీజేపీలోకి పోతారన్నారు. రేవంత్‌రెడ్డి కల్తీ మనిషని, టీడీపీ, బీజేపీ, కాంగ్రెస్ ఇలా పార్టీలు మారుస్తూ ఏ ఎండకు ఆ గొడుగు పడతారని అన్నారు.

గంభీరావుపేట అభివృద్ధిపై బండి సంజయ్ చర్చకు రావాలి

గంభీరావుపేట మండలానికి ఎంపీ బండి సంజయ్ ఏం చేశాడో చర్చకు రావాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఐదేళ్ల కాలంలో కరీంనగర్ నియోజక వర్గం మొదలుకొని సిరిసిల్ల నియోజక వర్గంలోని గంభీరావుపేట మండలం వరకు ఎంపీ బండి సంజయ్ ఏం చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. కరీంనగర్ ప్లామెంట్ సభ్యుడిగా ఎప్పుడైనా మండల పరిషత్ మీటింగ్, జిల్లా పరిషత్ మీటింగ్, మున్సిపల్ సమావేశాలకు బండి సంజయ్ వెళ్లారా? అని ప్రశ్నించారు. పార్లమెంటు సమావేశాల్లో రైతులు, ప్రజల కోసం బండి సంజయ్ గొంతు విప్పిన చరిత్ర ఉందా? అన్నారు. ఐదేళ్లలో బండి సంజయ్ పైసా పని చేయలేదన్నారు. దేశం కోసం దర్మకోసం అంటూ గాలి తిరుగుడు తిరిగే ఎంపీ కావాలా లేదా కరీంనగర్ ప్రజల కోసం గట్టిగా కొట్లాడే ఎంపీ కావాలా ప్రజలే నిర్ణయించాలన్నారు. చిత్తశుద్ధి ఉంటే బండి సంజయ్ ఎంపీగా ఉన్న ఐదేళ్లలో ఏం చేశారో చెప్పాలని, అంతకుముందు ఉన్న వినోద్‌కుమార్ ఏం చేశారో ప్రజల ముందు చెప్తారని అన్నారు. దమ్ముంటే గంభీరావుపేటలో జరిగే చర్చకు రావాలన్నారు. డేట్, టైం బండి సంజయ్ ఇష్టమని, దమ్ముంటే ఈ సవాల్‌ను స్వీకరించాలని బీజేపీ నాయకత్వాన్ని డిమాండ్ చేశారు.

నర్మాల మానేరుకు జలకళ తెచ్చింది మేమే

గంభీరావుపేట మండలం నర్మాల అప్పర్ మానేరు నిండాలి.. శాశ్వత జలకళతో ఉండాలనే ప్రజల చిరకాల కోరిక నేరవేర్చింది కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వమేనని కేటీఆర్ అన్నారు. కాళేశ్వరం జలాలతో నర్మాల అప్పర్ మానేరును నింపి ఈ ప్రాంతాన్ని సస్యశామలం చేసిన ఘనత కేసీఆర్ దేనన్నారు. ఈ నెల 12న కరీంనగర్ నుంచి పార్లమెంటు ఎన్నికల శంఖారావ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నాఫ్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, రాష్ట్ర బ్రాహ్మణ పరిషత్ మాజీ డైరెక్టర్ సుమలతశర్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి, ఎంపీపీ వంగ కరుణసురెందర్‌రెడ్డి, జడ్పీటీసీ కొమిరిశెట్టి విజయలక్ష్మన్, సెస్ డైరెక్టర్ గొరినేని నారాయణరావు, జడ్పీ కో ఆప్షన్ హైమద్, పట్టణ అధ్యక్షుడు పెద్దవేని వెంకటి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు దయాకర్‌రావు, హన్మంతరెడ్డి, సీనియర్ నాయకులు రాజారాం, లింగమ్‌యాదవ్, మల్లేశం, రాజేందర్, రాజనర్సు, శివయ్య, నాగరాజు, అభిలాష్, శంకర్‌గౌడ్, వహీద్ ఉన్నారు.



ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లందకుంట, మార్చి 10: మానేరు పరివాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై రాజకుమార్ తెలిపారు. ఆదివారం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కనగర్తి గ్రామం మీదుగా అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

- మరో ముగ్గురికి అస్వస్థత
- బోరు మోటారు దించే క్రమంలో ఘటన

కోనరావుపేట, మార్చి 10: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని కోనరావుపేట మండలం బావుసాయిపేటలో ఆదివారం విద్యుదాఘాతంతో పంబాల భూమయ్య (35) అనే రైతు మృతి చెందాడు. మరో ముగ్గురు అస్వస్థతకు గురయ్యారు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం బావుసాయిపేటలోని తిక్కల భూమయ్యకు చెందిన వ్యవసాయ భూమి వద్ద బోరు బావిలో మోటారు దించడానికి రైతులను తీసుకెళ్లాడు. మోటారు


భూమయ్య(ఫైల్)

దించుతున్న క్రమంలో పైన ఉన్న విద్యుత్ తీగలు బోరు బావి పైపునకు తగలడంతో నలుగురు రైతులు విద్యుదాఘాతానికి గురయ్యారు. వారిలో పంబాల భూమయ్య అనే రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. పంబాల రాజు, కర్నాల మహేష్, తుపాకుల శ్రీనివాస్ అస్వస్థతకు గురవగా అక్కడే ఉన్న మరి కొంతమంది రైతులు వేములవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆసుపత్రికి చేరుకొని రైతు కుటుంబాలను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. మృతి చెందిన పంబాల భూమయ్యకు భార్య అనిత, కుమారుడు రేశ్వంత్, కూతురు గౌతమి ఉన్నారు.

రోడ్డుపై ధర్నా.. పోలీసు విధులకు ఆటంకంపై కేసు

కరీంనగర్ క్రైం, మార్చి10: కరీంనగర్‌లోని రాంనగర్ చౌరస్తాలో ఆదివారం రాత్రి స్థానికులు కొందరు ధర్నాకు దిగారు. డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల సందర్భంలో ట్రాఫిక్ పోలీసులు దురుసుగా ప్రవర్తించారంటూ రోడ్డుపై బైఠాయించి వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. రెండో టౌన్ సీఐ రమేశ్ సంఘటనా స్థలానికి వెళ్లి ధర్నాను విరమింపజేశారు. ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలలో పట్టుబడిన కొందరు తమ వాహనాలను ఇవ్వాలని పోలీసులతో వాగ్వాదం చేస్తూ విధులకు ఆటంకం కలిగించారని రెండో టౌన్ సీఐ రమేశ్ తెలిపారు. పోలీసుల విధులను ఆటంకపరిచినందుకు ఇద్దరిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. పట్టుకున్న వాహనాలను టౌన్‌కు తరలించినట్లు తెలిపారు.

గోపాల్‌రావుపేటలో చోరీ

రామడుగు, మార్చి 10: మండలంలోని గోపాల్‌రావుపేటలోని ఓ ఫొటో అండ్ వీడియో షాపులో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గోపాల్‌రావుపేట బస్టాండ్ వద్ద మధు అనే యువకుడు ఫొటో స్టూడియోతో పాటు గడియారాల షాపును నిర్వహిస్తున్నాడు. షాపు యజమాని ఆదివారం ఉదయం షాపును తీసేందుకు వెళ్లగా వెనుక తలుపు తీసి ఉండడాన్ని గమనించాడు. దుకాణంలో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. దీంతో కౌంటర్‌లో చూడగా రూ. 10,500 కనబడలేదు. దీంతో పాటు దుకాణంలో ఉన్న 20 గడియారాలు చోరీకి గురి అయినట్లు గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై సురేందర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమీపంలోని నాలుగైదు దుకాణాల షాపుల తాళాలను పగుకొట్టేందుకు ప్రయత్నించగా అవి రాకపోవడంతో వెళ్లిపోయినట్లు ఆయా దుకాణాల యజమానులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కరీంనగర్ క్రైం, మార్చి 10: కరీంనగర్‌లోని పాతబజారులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పాతబజారుకు చెందిన శివరవీందర్(64), ఆయన తల్లి శివసువర్ణ(85)లకు తీవ్ర గాయాలయ్యాయని ఒకటో టౌన్ పోలీసులు తెలిపారు. రాఘవేంద్రనగర్ నుంచి ద్విచక్ర వాహనంపై పాతబజారుకు వెళ్తుండగా ఒక ద్విచక్రవాహనం వేగంగా వచ్చి ఢీకొట్టిందని తెలిపారు. గాయపడిన ఇద్దరిని 108లో ప్రభుత్వ ఆసుపత్రికి, ఆ తరువాత ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారని పోలీసులు తెలిపారు.


చదరంగ పోటీలకు స్పందన

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి 10: జీనియస్ చెస్ అకాడమి, తెలంగాణ డెమోక్రటిక్ చెస్ అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం జీనియస్ చెస్ అకాడమిలో నిర్వహించిన మహిళల ఉమ్మడి జిల్లా స్థాయి చదరంగ పోటీలకు విశేష స్పందన లభించింది. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 65 మంది పాల్గొని ప్రతిభ చాటారు. ప్రైమ్ కిడ్నీ సెంటర్ నిర్వాహకురాలు డాక్టర్ చాందిని పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో జీనియస్ చెస్ అకాడమి వ్యవస్థాపకుడు కనకయ్య, డాక్టర్ కృష్ణ చైతన్య, భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు నాగరాజు, సైకియాట్రిస్ట్ అనిత తదితరులు పాల్గొన్నారు.














రెవెన్యూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రతి గ్రామంలోనూ రెవెన్యూ ఉద్యోగి ఉండేలా చర్యలు చేపట్టాలి


సీఎంను కోరిన డిప్యూటీ కలెక్టర్ల, రాష్ట్ర తహసీల్దార్ల అసోసియేషన్లు

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థలను బలోపేతం చేయాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని డిప్యూటీ కలెక్టర్ల, రాష్ట్ర తహసీల్దార్ల అసోసియేషన్ల సభ్యులు కోరారు. ఆదివారం డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వి.లచ్చిరెడ్డి, కె. రామకృష్ణ, ఎస్.ఆర్ సరిత, తెలంగాణ తహసీల్దార్ల అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.రాములు, రమేశ్ పాక, అసోసియేట్ ప్రెసిడెంట్ పూల్‌సింగ్ సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. రెవెన్యూ వ్యవస్థ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలు, పూర్వ వీఆర్‌ఓ, వీఆర్‌ఏల పెండింగ్ సమస్యలు, తహసీల్దార్ల అద్దె వాహనాలకు బిల్లుల చెల్లింపు, క్యాడర్ బలోపేతం, తదితర అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు వారు తెలిపారు. రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత రెవెన్యూ డివిజన్లు, మండలాలు పెరిగినా.. రెవెన్యూ ఉద్యోగుల సంఖ్య పెరగలేదని చెప్పారు. దీంతో ఉన్న ఉద్యోగుల మీదనే పని భారం పడుతోందని, జిల్లాలు, మండలాలు, రెవెన్యూ డివిజన్లకు అనుగుణంగా క్యాడర్‌ను పెంచాలని సీఎంను కోరారు. ప్రతి గ్రామంలోనూ రెవెన్యూ ఉద్యోగి ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. జీఏడీ పరిధిలోని అదనపు కలెక్టర్ల పోస్టుల వ్యవహారాన్ని రెవెన్యూ విభాగ పరిధిలోకి తేవాలని విజ్ఞప్తి చేశారు. అన్ని అంశాలపై సీఎం సానుకూలంగా స్పందించినట్టు అసోసియేషన్ల ప్రతినిధులు తెలిపారు.

నేటి నుంచి లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాలు

» తొలిరోజు పూజల్లో పాల్గొననున్న సీఎం

» పట్టు వస్త్రాలు, తలంబ్రాల సమర్పణ



లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో విద్యుద్దీపాల వెలుగులు

యాదగిరిగుట్ట, మార్చి 10: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నృసింహస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. సోమవారం ఉదయం 10గంటలకు ప్రధానాలయ ముఖ మండపంలో అర్చక, వేదపండితుల బృందం సంప్రదాయరీతిలో లక్ష్మీనృసింహుల తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. తొలిరోజు వైదిక పూజల్లో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనున్నారు. ఆయన సోమవారం ఉదయం 9గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో యాదగిరిగుట్టలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడి నుంచి కాన్వాయ్‌లో కొండపైకి చేరుకుని వీవీపీ అతిథి గృహంలో కాసేపు విశ్రాంతి తీసుకుంటారు. 9.30గంటలకు ప్రధానాలయంలో స్వయంభువులను దర్శించుకుంటారు. స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను రాష్ట్ర ప్రభుత్వం తరఫున దేవస్థాన అధికారులకు అందజేస్తారు. ఉదయం 11గంటలకు రేవంత్ హెలికాప్టర్‌లో భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయానికి బయల్దేరివెళతారు. సీఎం రేవంత్ పర్యటన నేపథ్యంలో కొండ కింద పాత గోశాల ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న హెలీప్యాడ్ వద్ద పనులను ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఆదివారం పరిశీలించారు. బ్రహ్మోత్సవాల తొలిరోజు పూజల్లో సీఎంతో పాటు డిప్యూటీ సీఎం భట్టి, పలువురు మంత్రులు పాల్గొంటారని అధికారులు పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఈసారి రూ.1.60కోట్లు కేటాయించామని, అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ ఈవో రామకృష్ణారావు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 18న జరిగే తిరుకల్యాణోత్సవంలో భక్తులు పాల్గొనే విధంగా 600 టికెట్లను విక్రయిస్తామని, ఒక్కో టికెట్ ధర రూ.3వేలని తెలిపారు. కాగా, బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 17న రాత్రి ఎదుర్కోలు, 18న రాత్రి తిరుకల్యాణోత్సవం, 19న రాత్రి దివ్య విమాన రథోత్సవ ఘట్టాలను నిర్వహిస్తారు. ఈ నెల 20న మహాపూర్ణాహుతి, చక్రతీర్థ స్నానం ఉంటుంది. 21వ తేదీన అష్టోత్తర శతఘటాభిషేకం, పండిత సన్మానంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమవుతాయి.

లోకం తీరు



ఉద్యోగులకు ఏడో గ్యారెంటీ!

(మొదటి పేజీ తరువాయి)



ఇస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగుల డీఏ, పీఆర్సీపై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆదివారం ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో ఎంసీహెచ్ఆర్డీలో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇన్ని రోజులూ ఆయా ప్రభుత్వ ఉద్యోగ సంఘాలకు గౌరవ అధ్యక్షులుగా ఉన్నది కేసీఆర్ కుటుంబమేనన్నారు. నిర్బంధాలతో పాలన సాగిస్తామనుకోవడం వారి భ్రమ అని, సమస్యలకు చర్చలే పరిష్కారం తప్ప.. నిర్బంధాలు కావని అన్నారు. ప్రభుత్వంపై ఉద్యోగులకు విశ్వాసం కల్పించడానికే చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారానికి ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించామని గుర్తు చేశారు. మంత్రివర్గ ఉపసంఘం శాఖల వారీగా సమావేశం నిర్వహించి నిర్ణయాలు తీసుకుంటుందని, సంఘాలతో చర్చించకుండా నిర్ణయాలు తీసుకోబోమని స్పష్టం చేశారు. ఉద్యోగుల డీఏతో పాటు ఇతర అంశాలపై మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని, వివిధ శాఖల్లో ఉన్న 1100 మంది రిటైర్డ్ ఉద్యోగుల కొనసాగింపుపైనా త్వరలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలకు ఉచితంగా విద్యుత్తు ఇచ్చే విషయంలోనూ క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కిందిస్థాయి సిబ్బందిని నియమిస్తామని చెప్పారు. ఉద్యోగులకు ఒకటో తారీకునే జీతాలు వేసినా తాము ప్రచారం చేసుకోవడం లేదన్నారు. రోజుకు 18 గంటలు పనిచేస్తూ పాలనను గాడిలో పెడుతున్నామని చెప్పారు.

తెలంగాణ బాపు కేసీఆర్ కాదు..

మాజీ సీఎం కేసీఆర్ తనకు తాను తెలంగాణ బాపుగా చెప్పుకొంటున్నారని, అలా చెప్పుకోవడానికి కనీస పోలిక ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ బాపు, సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ అని, తెలంగాణ ఆత్మను గౌరవించకపోతే సమాజం మనల్ని క్షమించదని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఆదాయం పడిపోతే.. మద్యంపై వచ్చే ఆదాయంపైనే ఆధారపడేలా కేసీఆర్ పాలన సాగిందని విమర్శించారు. విద్యార్థి, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల పోరాటంతోనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని రేవంత్ అన్నారు. రక్తం చిందించకుండా తెలంగాణ సాధించామని కేసీఆర్ పచ్చి అబద్ధాలు మాట్లాడారని విమర్శించారు. కేసీఆర్ కుటుంబంలో ఎవరి రక్తమూ చిందలేదని, కానీ.. కానిస్టేబుల్ కిష్టయ్య లాంటివారు రక్తాన్ని చిందించారని, శ్రీకాంతాచారి లాంటివారు మాంసపు ముద్దలయ్యారని అన్నారు. టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్‌ను శాసన మండలికి తప్పక పంపుతామని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆయన ఎమ్మెల్సీగా ఉంటే శాసనమండలికి గౌరవమన్నారు. ఈ విషయంపై గవర్నర్ తమిళిసైతో మాట్లాడతానన్నారు. ఈ సమావేశంలో మంత్రి డి.శ్రీధర్‌బాబు, కోదండరామ్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

టీచర్లు, ఉద్యోగులలో సంతోషం..

ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో పదేళ్ల తర్వాత ముఖ్యమంత్రి ముఖాముఖి సమావేశం కావడం పట్ల ఆయా సంఘాలు సంతోషం వ్యక్తం చేశాయి. తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు ప్రత్యేక చొరవతో ఏర్పాటైన ఈ సమావేశంలో.. ప్రధాన డిమాండ్లను సీఎం దృష్టికి టీజీవోఏ తీసుకెళ్లింది. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏల్లో మూడింటిని ఇవ్వాలని, సీపీఎస్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరింది. వీటితోపాటు పదేళ్లగా పెండింగ్‌లో ఉన్న హెల్త్ కార్డులను వెంటనే ఇవ్వాలని, పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలని విన్నవించింది. కాగా, ముఖ్యమంత్రి రెండు గంటలపాటు తమ సమస్యలపై మాట్లాడమే కాకుండా ఎంతో ఓపికగా విన్నారని సంఘాల నేతలు తెలిపారు. గతంలో కనీసం సమస్యలు వినే పరిస్థితి కూడా ఉండేది కాదన్నారు. కాగా, వైద్యశాఖలో పని చేస్తున్న మెడికల్ సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్ అందరినీ బదిలీ చేయాలని మెడికల్ జేఏసీ.. ముఖ్యమంత్రిని కోరింది. ఉస్మానియాకు కొత్త భవనం కట్టాలని, అశాస్త్రీయంగా ఉన్న మెడికల్ కాలేజీల సంఖ్యను తగ్గించాలని సూచించింది. ఆస్పత్రుల్లో విధులకు వచ్చే నర్సులు దుస్తులు మార్చుకునేందుకు కనీసం రూమ్‌లు లేని విషయాన్ని నర్సుల అసోసియేషన్ సీఎం దృష్టికి తీసుకెళ్లింది. ఇక సాధారణ బదిలీలు, పదోన్నతులు, 317 సమస్యను పరిష్కరించాలని, ఉపాధ్యాయ, ఉద్యోగుల సీపీఎస్ రద్దు, పాత పెన్షన్ పునరుద్ధరణపై ఆయా సంఘాల ప్రతినిధులు సీఎంకు వినతి పత్రం ఇచ్చారు. ప్రధానంగా టీచర్లకు సంబంధించిన మల్టీజోన్, స్పౌజ్ సమస్యలు, స్థానికత, బదిలీలు, ఆరోగ్య బీమా, పెండింగ్ డీఏ లాంటి సమస్యలను వివరించారు. కాగా వినతి పత్రాలను కొన్నింటిని సీఎం నేరుగా తీసుకున్నారు.

సీఎంకు పీఆర్‌టీయూ నేతల కృతజ్ఞతలు

ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించడమే కాకుండా సమస్యల్ని త్వరలోనే పరిష్కరిస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇవ్వడం పట్ల పీఆర్‌టీయూ నేతలు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, కమలాకర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.

అధికారంలోకి వచ్చిన 72 రోజులకే 31వేల ఉద్యోగాలిచ్చాం

మరో గ్యారెంటీకి శ్రీకారం: పొంగులేటి

మాటిస్తే కాంగ్రెస్ మడమ తిప్పదు: సురేఖ

జీవో 3పై కవిత వ్యాఖ్య విడ్డూరం: సీతక్క

వరంగల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తాము అధికారంలోకి వచ్చిన 72 రోజుల్లోనే 32వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి, యుద్ధప్రతిపాదికన ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం నిరుద్యోగ యువత ఉసురు తీసుకుందని, తాము 11,600 టీచర్ ఉద్యోగాల భర్తీకి మెగా డీఎస్సీ కోసం నోటిఫికేషన్ ఇచ్చామని పేర్కొన్నారు. ఆదివారం హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీలో రూ.68 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు, వరంగల్ నగరంలో రూ.280.85 కోట్లతో చేపట్టిన పనులకు మంత్రులు కొండా సురేఖ, సీతక్కతో కలిసి ఆయన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే నాలుగు పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సోమవారం భద్రాచలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. అర్హులైన పేదలందరికీ సొంతింటి కలను సాకారం చేస్తామని తెలిపారు. ఒకటో తేదీ నుంచి మూడో తేదీలోపు ఉద్యోగులకు వేతనాలు ఇస్తున్న ప్రభుత్వం తమదని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట తప్పదని మంత్రి కొండా సురేఖ అన్నారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని, అందులో భాగంగానే సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ నగరానికి రూ.260కోట్ల నిధులు కేటాయించారని తెలిపారు. జీవో నంబరు 3కు వ్యతిరేకంగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత మాట్లాడడం విడ్డూరమని, అసలు ఆ జీవో ఇచ్చిందే కేసీఆర్ ప్రభుత్వమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. తప్పుడు ప్రచారాలు బంద్ చేసి, నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరించాలని సూచించారు.

భట్టి నాకు ద్రోహం చేస్తున్నారు

» ఖమ్మం టికెట్‌ను అడ్డుకుంటున్నారు: వీహెచ్

న్యూఢిల్లీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తనకు ద్రోహం చేస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ హనుమంతరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఖమ్మం లోక్‌సభ సీటు తనకు రాకుండా భట్టి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఆదివారం ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో విలేకరుల సమావేశంలో వీహెచ్ మాట్లాడారు. 'భట్టిని అప్పట్లో ఎమ్మెల్సీని చేయడంలో నాదే కీలక పాత్ర.. భట్టి ఈరోజు పార్టీలో ఈస్థానంలో ఉండడానికి కారణం నేనే.. 2019 వరకు ఖమ్మంలో ప్రతి కార్యక్రమానికి ఆయన నన్ను రమ్మన్నారు.. ఆ తర్వాత పిలవడం మానేశారు. పనిచేసినోడికి ముఖ్యమంత్రి పదవి రావాలని నేను అన్నందుకే నాపై కక్ష కట్టారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ పార్టీ కోసం చాలా కష్టపడ్డారని చెప్పారు. 'రాహుల్‌ఖమ్మం నుంచి పోటీ చేస్తే నేను తప్పుకుంటా.. లేదంటే ఆ సీటుకు నేను అన్నివిధాల అర్హుడిని.. ఖమ్మం టికెట్ ఇస్తే భారీ మెజారిటీతో గెలుస్తా.. పదవి ఉన్నా లేకపోయినా చనిపోయేవరకు కాంగ్రెస్‌లోనే ఉంటా.. చనిపోయిన తర్వాత పార్టీ జెండా నాపై ఉంటుంది' అని వ్యాఖ్యానించారు.

వీహెచ్‌కు ఖమ్మం టికెటిస్తే కలిసికట్టుగా గెలిపిస్తాం

» నేను అడ్డుపడడం..ఆయన అపోహ: భట్టి

చింతకాని, మార్చి 10: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపికలో కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీదే తుది నిర్ణయమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఆ కమిటీ నిర్ణయం మేరకే అభ్యర్థుల ఎంపిక ఉంటుదని స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలంలో పర్యటించిన భట్టి.. ఎంపీ టికెట్ల కేటాయింపు విషయమై పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావు చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. పార్టీ అధిష్ఠానం వీహెచ్‌కు ఖమ్మం ఎంపీ టికెట్ ఇస్తే జిల్లా మంత్రులు, నాయకులు, కార్యకర్తలు.. అందరం కలసికట్టుగా పనిచేసి గెలిపించుకుంటామని చెప్పారు. ఖమ్మం ఎంపీ టికెట్ వీహెచ్‌కు రాకుండా తాను అడ్డుపడటం లేదని.. అది కేవలం ఆయన అపోహ మాత్రమేనన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడిగా వీహెచ్‌కు తన పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుతో పాటు రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే తమ తక్షణ కర్తవ్యమన్నారు. లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక విషయంలో అధిష్ఠానం నిర్ణయానికి తామంతా కట్టుబడి ఉంటామని తెలిపారు.

మాకు న్యాయం చేయండి

» 317 జీవో వల్ల బాధితులుగా మారాం

» మంత్రి దామోదరను కలిసిన నర్సులు

గత సర్కారు హయాంలో విడుదల చేసిన జీవో నంబరు 317 వల్ల తాము బాధితులుగా మారామని, తమకు న్యాయం చేయాలని కోరుతూ నర్సులు వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను ఆదివారం ఆయన నివాసంలో కలిశారు. తమ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాన్ని అందజేశారు. గత ప్రభుత్వం నిరంకుశంగా జోనల్ వ్యవస్థను తీసుకొచ్చి తమ జీవితాలతో చెలగాటం ఆడుకుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 317జీవోపై క్యాబినెట్ సబ్ కమిటీలో చర్చించి, అందరికీ న్యాయం చేస్తామని మంత్రి ఉద్యోగులకు భరోసానిచ్చారు.

పేదింటి పండుగ

నేడు 'ఇందిరమ్మ ఇల్లు' పథకం ప్రారంభించనున్న సీఎం రేవంత్



హైదరాబాద్, ఖమ్మం/భద్రాచలం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పేదవాడి సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. "ఇందిరమ్మ ఇల్లు" పథకం కార్యరూపం దాల్చనుంది. రాముల వారు కొలువైన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం భద్రాచలంలో సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ ప్రాంగణం దీనికి వేదిక కానుంది. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఇందిరమ్మ ఇల్లు ఐదోది. అధికారంలోకి వచ్చాక మూడు నెలల్లో నాలుగు పథకాలను అమలు చేసింది. కాగా, ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సంబంధించి మూడు నమూనాలను కూడా సోమవారం ప్రకటించనున్నారు. పథకం అమలుకు అవసరమైన మార్గదర్శకాలను సర్కారు సిద్ధం చేసింది. ఇల్లు లేని అర్హులైన పేదలందరికీ దశలవారీగా వర్తింపజేయనున్నారు. స్థలం ఉన్నవారికి రూ.5 లక్షలు, లేనివారికి స్థలం ఇచ్చి రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేయనున్నారు. ఈ మొత్తాన్ని నాలుగు దశల్లో మంజూరు చేస్తారు. ఈ ఏడాదిలో నియోజకవర్గానికి 3,500 చొప్పున 119 నియోజకవర్గాలకు 4,16,500 ఇళ్లను మంజూరు చేయగా.. రిజర్వ్ కోటా (సీఎం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పరిధి)లో మరో 33,500 కేటాయించారు. మొత్తంగా 4.50లక్షల ఇళ్లు మంజూరు కానున్నాయి. తొలి దశలో సొంత స్థలం ఉన్నవారికి అందనుండగా.. స్థలం లేనివారికి రెండో దశలో పథకాన్ని వర్తింపజేస్తారు. ఇంటి నిర్మాణం విషయంలో లబ్ధిదారుదే పూర్తి నిర్ణయం అయినప్పటికీ.. ఆర్‌సీసీ స్ట్రక్చర్‌తో పాటు కచ్చితంగా వంట గది, బాత్‌రూమ్ ఉండాలి. అనంతరం 'ఇందిరమ్మ ఇల్లు' పథకం కింద నిర్మించినదని తెలిసేలా 'అభయహస్తం' లేదా ప్రత్యేకంగా తయారు చేసే కొత్త లోగోను ఉంచనున్నారు. కాగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాల విషయంలో చేసిన తప్పులు ఈసారి జరగకుండా, అర్హులకే పథకం అందేలా మార్గదర్శకాలను ఖరారు చేశారు. ఈ పథకానికి అర్హులైన వారు దాదాపు 30-40 లక్షలమంది ఉండొచ్చని ప్రభుత్వం అంచనా వేస్తోంది. 'ప్రజాపాలన' దరఖాస్తుల ఆన్‌లైన్ పూర్తయ్యాక హెచ్చుతగ్గులు ఉండొచ్చని కూడా భావిస్తోంది. దరఖాస్తులన్నింటినీ క్షుణ్ణంగా తనిఖీ చేయడంతో పాటు అవసరమైతే గ్రామసభల్లోనూ మరోసారి పరిశీలించనున్నారు. గ్రామ సభల్లో వివరాలను నమోదు చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే ఒక ప్రొఫార్మాను రూపొందించింది.

పథకం కోసం రుణం..

ఇందిరమ్మ ఇల్లు పథకం కోసం రాష్ట్ర ప్రభుత్వం హడ్కో నుంచి రూ.3 వేల కోట్ల రుణం తీసుకోనుంది. ఎన్ని ఇళ్లను ఏయే దశల్లో నిర్మిస్తామనే వివరాలను కూడా తెలిపింది. తొలి శలో గ్రామీణ ప్రాంతాల్లో 57,141, పట్టణాల్లో 38,094 ఇళ్లను నిర్మిస్తామని పేర్కొంటూ ఈ నె 5న జీవో విడుదల చేసింది. దీని ప్రకారం నియోజకవర్గానికి 800 ఇళ్లు అందనున్నట్టు తెలుస్తోంది. ఈ గణాంకాలు, అంచనాలు హడ్కో రుణం కోసం సంబంధించినవేనని సమాచారం. వీటికి మరికొన్ని కలిపి ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేయనుంది. 'ఇందిరమ్మ ఇల్లు' పథకాన్ని మహిళ పేరు మీద అందిస్తారు. ప్రత్యేక పోర్టల్ ద్వారా నిర్మాణాలను పర్యవేక్షిస్తారు. లబ్ధిదారుకి రేషన్ కార్డు కచ్చితంగా ఉండాలి. గతంలో ఇందిరమ్మ ఇల్లు పొంది ఉంటే అనర్హులు. మంజూరైన ఇళ్ల కంటే లబ్ధిదారులు ఎక్కువ ఉంటే.. వారికి మరో విడతలో అందిస్తారు.

సీఎం భద్రాచలం పర్యటన షెడ్యూల్ ఇది..

సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం 12:10 గంటలకు భద్రాచలం రాముడిని దర్శించుకోనున్నారు. 1:30కు వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటుచేసిన సభలో 'ఇందిరమ్మ ఇల్లు' పథకాన్ని ప్రారంభిస్తారు. 2:30 నుంచి 3:30 మధ్య భద్రాచలం ఆలయం, సాగునీటి, దేవాదాయ శాఖ అధికారులతో సమావేశమై సీతారామ, సీతమ్మసాగర్ ప్రాజెక్టుల పనుల పురోగతిపై సమీక్షిస్తారు. సాయంత్రం 4 గంటలకు మణుగూరులో సభకు హాజరవుతారు. 6:10 గంటలకు హైదరాబాద్‌కు తిరిగి చేరుకుంటారు.

భద్రాచలం రామాలయం అభివృద్ధిపై ఆశ

హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా భద్రాచలం వచ్చిన రేవంత్.. అధికారంలోకి వస్తే ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సీఎం హోదాలో ఇప్పుడు భద్రాద్రి అభివద్ధికి వరాలు ప్రకటిస్తారని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం భద్రాచలం అభివృద్ధికి రూ.100కోట్లు ప్రకటించినా రూపాయీ ఇవ్వలేదు.

అప్పుల రాష్ట్రాన్ని అప్పగించినా హామీలు నెరవేరుస్తున్నాం: తుమ్మల



ఖమ్మంకార్పొరేషన్: ప్రజల సొమ్ము దోచుకోవటమే ధ్యేయంగా పనిచేసిన గత ప్రభుత్వం తమకు అప్పుల రాష్ట్రాన్ని అప్పగించినా సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో సాహసంతో ఎన్నికల హామీలను నెరవేరుస్తున్నారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా బూడిదెంపాడు వద్ద రూ.38.50 కోట్లతో ఖమ్మం-ఇల్లెందు రెండులైన్ల రహదారి నాలుగులైన్లుగా విస్తరణ, అభివృద్ధి పనులకు ఆదివారం మంత్రి శంకుస్థాపన చేశారు. సోమవారం భద్రాద్రి రాముడి సన్నిధిలో సీఎం రేవంత్‌రెడ్డి ఐదో గ్యారెంటీగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభిస్తారన్నారు. శ్రీశైలం, సాగర్‌లో నీళ్లు లేకపోవడానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వ తప్పిదాలే కారణమన్నారు.

బడుల్లో మార్పు రావాల్సిందే!

» మౌలిక సదుపాయాలు కల్పించండి

» సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పూర్తి చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో స్పష్టమైన మార్పు కనిపించాలని.. వాటిపై ప్రజలకు నమ్మకం కలిగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్కారీ బడులు, కళాశాలలకు తక్షణమే ఉచిత విద్యుత్ అమలయ్యేలా చూడాలన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై ఆదివారం ఎంసీఆర్‌హెచ్ఆర్డీలో ఆయా శాఖల ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష జరిపారు. విద్యార్థులకు యూనిఫామ్‌తో పాటు.. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటు, పర్యవేక్షణ బాధ్యతలను స్వయం సహాయక మహిళా సంఘాలకు అప్పగించే అంశాన్ని పరిశీలించాలన్నారు. ఇతర రాష్ట్రాల ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించి వాటిని రాష్ట్రంలో అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ తరగతి గదులు ఏర్పాటు చేసి.. టీ-శాట్ ద్వారా అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో డిజిటల్ పాఠాలు అందించాలని, బడులపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుపై దృష్టిసారించాలని, సీఎస్ఆర్ ఫండ్స్ కోసం ప్రయత్నం చేయాలని, సౌకర్యాలను మెరుగుపరచేందుకు ఎన్నారైల సహకారం తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలన్నారు. స్కిల్ యూనివర్సిటీ కోసం ఐఎస్‌బీ తరహాలో గవర్నింగ్ బాడీని ఏర్పాటు చేయాలన్నారు. న్యాక్‌పై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలన్నారు. సచివాలయం నుంచి కిందిస్థాయి వరకూ ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టం (ఎఫ్ఆర్‌ఎస్) తీసుకువచ్చే అంశంపై సీఎం చర్చించారు. సమీక్షలో మంత్రి శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎస్ శాంతికుమారి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



ఉపాధ్యాయులతో విద్యార్థులు

తంగళ్లపల్లి, మార్చి 10: తంగళ్లపల్లి మండలం మండేపల్లిలో ప్రభుత్వ పాఠశాల 2003-04 పదోతరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. అంతకుముందు పాఠశాలలో పలు అభివృద్ధి పనులకు సహాయమందించారు.

బీజేపీతోనే అట్టడుగువర్గాలకు న్యాయం

ఇల్లంతకుంట, మార్చి 10: బీజేపీతోనే అట్టడుగువర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ పరిపాలనతో ప్రపంచంలోనే భారతదేశానికి అగ్రగామిగా గుర్తింపు వచ్చిందన్నారు. అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శులుగా తిప్పారపు శ్రావణ్, సూదుల కిషన్, పున్ని సంపత్, ఉపాధ్యక్షులుగా చిమ్మనగొట్టు శ్రీనివాస్, కామల్ల ఎల్లేష్, పెంటల వేణు, గుంటి మహేష్, భూమల్ల అనీల్, పున్ని రాజు, కార్యదర్శులుగా బిల్ల సతీష్, కీర్తి రాజు, యువమోర్చా మండల అధ్యక్షుడిగా వజ్జపల్లి శ్రీకాంత్, కిసాన్ మోర్చ అధ్యక్షుడిగా చింతలపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా కర్ల లక్ష్మన్, దళితమోర్చా అధ్యక్షుడిగా కట్కూరి తిరుపతి తదితరులు ఎన్నికయ్యారు.

రేణుకా ఎల్లమ్మ సిద్దోగానికి ఏర్పాట్లు

ఎల్లారెడ్డిపేట, మార్చి 10: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో సోమవారం నుంచి నిర్వహించనున్న రేణుకా ఎల్లమ్మ సిద్దోగానికి ఏర్పాట్లు పూర్తి చేశామని సంఘం సభ్యులు ఆదివారం తెలిపారు. సోమ, మంగళవారాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం రేణుకా ఎల్లమ్మ జమదగ్నిల కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నామన్నారు.

దివ్యాంగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించాలి

సిరిసిల్ల టౌన్, మార్చి 10: తెలంగాణ ప్రభుత్వం దివ్యాంగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించాలని జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మంగలారపు రాజేందర్ అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం సత్యసాయి సేవా మందిరం ఆవరణలో జిల్లా సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. బ్యాక్ లాగ్ పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని, ప్రైవేటు సెక్టార్లలో దివ్యాంగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి వెల్ది గణేష్, సహాయ కార్యదర్శి బొద్దుల రవి, గౌరవ అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేటలో తూనికలు, కొలతల అధికారుల తనిఖీలు

ఎల్లారెడ్డిపేట, మార్చి 10: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఆదివారం తూనికలు, కొలతల అధికారులు తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రంలోని మొదటి బైపాస్ రోడ్డులో కొనసాగుతున్న మాంసం దుకాణాల వద్ద తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా తూకం వేస్తున్న పలువురు వ్యాపారులకు జరిమానా విధించారు. తూకంలో మోసగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సంఘం సభ్యుల సంక్షేమానికి కృషి

ఎల్లారెడ్డిపేట, మార్చి 10: సంఘం సభ్యుల సంక్షేమానికి కృషి చేస్తామని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాడూరు కరుణాకర్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలో అనారోగ్యంతో బాధ పడుతున్న విలేకరి చేపూరి నాగరాజును సంఘం నాయకులతో కలిసి ఆదివారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. గ్రామీణ విలేకరిగా కొనసాగుతూ అనారోగ్యం బారిన పడి ఆర్థిక పరిస్థితి సరిగా లేక మెరుగైన వైద్యం అందకుండాపోతోందన్నారు. నాగరాజుకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రెస్ అకాడమీ, ప్రభుత్వం పక్షాన ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు. జర్నలిస్టులకు ఆరోగ్య బీమా వర్తింప చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సంఘం సభ్యులు ముత్యం, సతీష్, మారుతిస్వామి, మజీద్, బాల్‌రెడ్డి, బాబు, రవి, జగదీష్, దేవరాజు, చంద్రమోహన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు చేపూరి రాజేశం తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుడిపై ఫిర్యాదు

తంగళ్లపల్లి, మార్చి 10:తంగళ్లపల్లి మండలం జిల్లెలకు చెందిన బీఆర్ఎస్ నాయకుడిపై కాంగ్రెస్ శ్రేణులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నాయకులను ఉద్దేశించి సోషల్ మీడియా వేదికగా అసభ్య పదజాలంతో తప్పుడు పోస్టులు పెడుతున్నారని పేర్కొన్నారు. ప్రజలను, కాంగ్రెస్ నాయకులను రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టిన బీఆర్ఎస్ నాయకుడిపై చర్యలు తీసుకోవాలన్నారు.

ఇల్లు చేరిన గల్ఫ్ మృతదేహం

ఎల్లారెడ్డిపేట, మార్చి 10: ఉన్న ఊరిలో ఉపాధి లేక బహ్రెయిన్ వలస వెళ్లిన బడుగు జీవి పల్లి అంజయ్య(43) ఈ నెల 6న గుండెపోటుతో మృతి చెందగా ఆయన మృతదేహం ఆదివారం ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామానికి చేరుకుంది. కొడుకులు లేకపోవడంతో చిన్న కూతురు దీప తండ్రి చితికి నిప్పు పెట్టింది. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం మేరకు.. గ్రామంలోని పల్లి అంజయ్య ఐదేళ్ల కిందట బహ్రెయిన్ దేశానికి వలస వెళ్లాడు. అక్కడ ఓ కంపెనీలో పనులు చేస్తూ బతుకు వెళ్లదీస్తుండేవాడు. రోజులాగే పనులకు వెళ్లేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ఒక్కసారిగా ఛాతిలో నొప్పి అంటూ కుప్పకూలాడు. ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అంజయ్య గుండెపోటుతో మృతి చెందాడని అక్కడి వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న అక్కపల్లికి చెందిన జీడబ్ల్యుఏసీ అధ్యక్షుడు తిరుపతి, పర్శరాములు, పెంకుల రాజేశ్వర్, భూమన్న, శేఖర్‌లు కంపెనీకి చెందిన క్యాంప్ ప్రతినిధి సాయన్నతో చర్చించారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేలా ఏర్పాట్లు చేశారు. హైదరాబాద్ విమానాశ్రయం నుంచి మృతదేహాన్ని తరలించేందుకు ఎన్ఆర్ఐ చిట్టి బాబు అంబులెన్స్‌ను సమకూర్చారు.

బీజేపీని గెలిపిస్తేనే పంచాయతీలకు నిధులు

మల్యాల, మార్చి 10:దేశ భవిష్యత్‌ను నిలబెట్టే ఈ ఎన్నికల్లో మోదీని ప్రధానమంత్రిని చేయడంతో పాటు బీజేపీ ఎంపీలను అత్యధికంగా గెలిపి స్తేనే పంచాయతీలకు నిధులు వస్తాయని బీజేపీ జాతీయ ప్రధాన కార్యద ర్శి ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. మల్యాల మండలంలోని తా టిపల్లి, తక్కళ్లపల్లి, మ్యాడంపల్లి, మల్యాల, ముత్యంపేట, పోతారం, మ ద్దుట్ల గ్రామాల్లో ఆదివారం ప్రజాహిత యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ తాము రాముని గురించి మాట్లాడితే కాం గ్రెస్, బీఆర్ఎస్‌లు ఓర్వలేకపోతున్నాయని ఆయా పార్టీలు ఔరంగజేబు గు రించి మాట్లాడుతారని విమర్శించారు. కాంగ్రెస్ మైనార్టీ డిక్లరేషన్ అని, బీఆర్ఎస్ ఎంఐఎంతో చెట్టాపట్టాలు వేసుకుంటున్నాయని అలాంటప్పుడు హిందువుల తరుపున కొట్లాడాలి కాబట్టి తాము రాముని గురించి మా ట్లాడుతున్నామని అన్నారు. ప్రజల కోసం తాము పోరాడి వందల కేసులు నమోదైతే ప్రజలు మాత్రం కాంగ్రెస్‌కు ఓటు వేయడం సరికాదన్నారు. కే సీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని తాము ఇస్తామ ని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసే య త్నం చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం తమ చిత్తశుద్ధిని నిరూపించు కోవాలంటే మంగళవారం జరిగే మంత్రివర్గ సమావేశంలో ఆరు గ్యారంటీల అమలపై ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సావిత్రీబాయి పూలేకు ఘన నివాళి



గంభీరావుపేటలో నివాళి అర్పిస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, మార్చి 10 : భారత దేశ మొదటి ఉపాధ్యాయిని సావిత్రి బాయిపూలే సమాజానికి ఆదర్శంగా నిలిచారని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం సీపీఐ కార్యాలయంలో సావిత్రీబాయిపూలే వర్ధంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ జ్యోతిబాపూలేతో కలసి సమాజ అభివృద్ధి కోసం సావిత్రీబాయిపూలే ఎంతో కృషి చేశారన్నారు. సీపీఐ సిరిసిల్ల పట్టణ కార్యదర్శి పంతం రవి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు మీసం లక్ష్మన్, అజ్జ వేణు, సోమ నాగరాజు, సత్తయ్య, బాలరాజు, నరసయ్య, పోచ్చయ్య, గంగవరం పాల్గొన్నారు.

● బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలో సావిత్రీబాయిపూలే వర్ధంతిని నిర్వహించారు. ఆమె చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్, నాయకులు మట్టె శ్రీనివాస్, నవీన్, రవి, రాకేష్, స్వామి, జగన్, వంశీ, పవన్, గణేష్, నరేష్, తిరుపతి పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్: సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సావిత్రీబాయిపూలే విగ్రహానికి ఉపాధ్యాయ సంఘాలతోపాటు జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ, తెలంగాణ రచయితల వేదికల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రచయితల వేదిక జాతీయ అధ్యక్షుడు జూకంటి జగన్నాథం, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు రామరాజు, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాకాల శంకర్‌గౌడ్ సావిత్రీబాయి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి సంపతి రమేష్, జిల్లా బాధ్యులు బుర్కగోపాల్, తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షుడు నాగరాజు, దాసరి రవీందర్, భూమేష్, మహిపాల్, నర్సింలు, కవి ఆడెపు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంలో దివంగత మాజీ మంత్రి పాటి రాజం విగ్రహం వద్ద సావిత్రీబాయి పూలే వర్ధంతి నిర్వహించారు. మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి పిట్ల రఘు, మండల అధ్యక్షుడు లక్కం బాబు, నాయకులు మనోజ్‌కుమార్, దోసల రామచంద్రం, నాంపెల్లి, రాజు, మౌనిక, లాస్య, భావన, సాహిత్య, బావన, లక్ష్మి తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు గుండారం, గొల్లపల్లి, బొప్పాపూర్, వెంకటాపూర్, బండలింగంపల్లి, తదితర గ్రామాల్లో సావిత్రీబాయి పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: నేటితరం యువత, విద్యార్థులు సావిత్రీబాయి పూలే పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జాలపల్లి మనోజ్ కుమార్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో సావిత్రీబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి ఎస్ఎఫ్ఐ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు జామవా, హారోన్, విష్ణు, పసుల మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో నివాళులర్పిస్తున్న నాయకులు

రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

సిరిసిల్ల టౌన్, మార్చి 10: విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన రైతు కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, మృతుడి భార్యకు సెస్‌లో ఉద్యోగం కల్పించాలని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ అన్నారు. కోనరావుపేట మండలం బావుసాయిపేటలో విద్యుదాఘాతంతో మృతి చెందిన రైతు పంబాల భూమయ్య కుటుంబాన్ని ఆదివారం సిరిసిల్ల ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదం జరగడం దురదృష్టకరమన్నారు. తెలంగాణలో పదేళ్లలో ఇలాంటి సంఘటనలు ఎక్కడా జరగలేదన్నారు. తెలంగాణలోని చెరువులు, బావులు, కుంటలు, బోర్లలో నీళ్లు ఎండి పోవడం దురదృష్టకరమన్నారు. ఈ సంవత్సరం నీళ్లు లేకపోవడంతో వేసుకున్న కొద్దిపాటి పొలాల్లోకి నీరు అందించాలని బోర్లలో పైపులను కిందికి దించే ప్రయత్నంలో పక్కకున్న విద్యుత్ తీగలకు పైపు తగిలి ప్రమాదం సంభవించిందన్నారు. జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణారాఘవరెడ్డి, సెస్ వైస్ చైర్మన్ తిరుపతి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ జడ్పీ చైర్ పర్సన్ తుల ఉమ, ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, కోనరావుపేట ఎంపీపీ చంద్రయ్య, పాక్స్ చైర్మన్ బండ నర్సయ్య, నాయకులు రాఘవరెడ్డి, గంగాధర్ ఉన్నారు.



బాధిత కుటుంబాన్ని వినోద్‌కుమార్, ఉమ

పేస్కేల్ ప్రకటనపై హర్షం

సిరిసిల్ల టౌన్, మార్చి 10: ప్రభుత్వం పేస్కేల్ ప్రకటించడంతో ఆదివారం సిరిసిల్ల టీఎస్ఆర్టీసీ డిపో ఎదుట ఆర్టీసీ అధికారులు, సిబ్బంది, కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం డిపో మేనేజర్ స్వీట్లను పంపిణీ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. టీఎస్ఆర్‌టీసీ సిరిసిల్ల డిపో మేనేజర్ ఎన్.మనోహర్, ఎస్‌టీఐ సారయ్య, సూపరింటెండెంట్ నక్క శ్రీనివాస్ పాల్గొన్నారు.



స్వీట్లను పంపిణీ చేస్తున్న డీఎం మనోహర్

ఇల్లంతకుంట: ఆర్టీసీ కార్మికులకు పీఆర్సీ ప్రకటించడంపై కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. మండలకేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తోందన్నారు. యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్, నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి, మాజీ ఎంపీపీ గుడిసె అయిలయ్య, నాయకులు అంతగిరి బాలపోచయ్య, కరివెద స్వప్నకర్ణాకర్‌రెడ్డి, ఒగ్గు రమేష్, రాజేశం, లింగం, నరేందర్‌రెడ్డి, సంతోష్‌కుమార్, విజయ్, బాస్కర్‌రెడ్డి, జమాల్, చేని శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలపై ఉద్యమించాలి

ఇల్లంతకుంట, మార్చి 10: కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై గ్రామగ్రామాన ఉద్యమించాలని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం మండల శాఖ అధ్యక్షుడు పల్లె నర్సింహరెడ్డి అధ్యక్షతన బీఆర్ఎస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన గ్యారంటీ పథకాల అమలులో విఫలమైందన్నారు. కొత్తగా రేషన్‌కార్డులు ఇవ్వకముందే ప్రతీ పథకానికి రేషన్‌కార్డు ఉండాలనే నిబంధన పెట్టడం సరికాదన్నారు. లబ్దిదారులను తగ్గించే ఎత్తుగడ ప్రభుత్వం వేస్తోందన్నారు. ఎంపీ బండి సంజయ్‌కుమార్ నియోజకవర్గానికి ఒక్క రూపాయి కేటాయించలేదని విమర్శించారు. ఈ నెల 12న కరీంనగర్‌లో జరిగే కదనబేరి సమావేశానికి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ వస్తున్నందున సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. పార్లమెంటు ఎన్నికలలో బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. అంకితభావంతో పనిచేసే కార్యకర్తలకు పార్టీలో తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జడ్పీవైస్ చైర్మన్ సిద్దం వేణు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహ్మారెడ్డి, ప్యాక్స్‌చైర్మన్ రొండ్ల తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్యయాదవ్, నాయకులు చెరుకుపల్లి రాజిరెడ్డి, గుండ ముత్తయ్య, చందన్, సలీం, పర్శరాం, మల్లారెడ్డి, చంద్రారెడ్డి, కేవీఎన్‌రెడ్డి, రాజారాం, మీసరగండ్ల అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రసమయి బాలకిషన్

దొడ్డి కొమురయ్య విగ్రహ ఆవిష్కరణ



విగ్రహ ఆవిష్కరణలో ప్రజాప్రతినిధులు

కోనరావుపేట, మార్చి 10: కోనరావుపేట మండలం సుద్దాలలో ఆదివారం సుద్దాల యంగ్ యాదవ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని కొలనూరు సింగిల్ విండో వైస్ చైర్మన్ కాశవేని మహేష్, గ్రామ ఎంపీటీసీ కాశవేణి మమత మహేష్ ఆవిష్కరించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించిన దొడ్డి కొమురయ్య సేవలను కొనియాడారు. కుంటెల్లి రాజయ్య, రామస్వామి, ఎల్లయ్య, పరశురాములు, నాగరాజు, మాజీ సర్పంచ్ ఉప్పుల దేవలక్ష్మీ, కాంగ్రెస్ నాయకులు కచ్చకాయల ఎల్లయ్య, బిజెపి నాయకులు కాంబోజ లక్ష్మీనారాయణ, నాయకులు ఎరవెల్లి విజయ్, ఎడవెల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఆసాములు

సిరిసిల్లలో ఆసాముల నిరసన

సిరిసిల్ల రూరల్, మార్చి 10: బతుకమ్మ చీరలతోపాటు ప్రభుత్వ ఆర్డర్‌లను అందించి ఆదుకోవాలంటూ ఆదివారం సిరిసిల్లలో ఆసాములు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌లో భద్రావతి సొసైటీ ఆవరణలో ఆసాముల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఆసాములు చేపట్టిన రిలేనిరాహార దీక్షలు ఆదివారానికి ఐదో రోజుకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా భిక్షాటన చేసి నిరసన తెలిపారు. కమిటీ అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్ సోమవారం కలెక్టరేట్ ముట్టడి చేపట్టినట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కారంపురి వైకుంఠం, గాజుల దేవదాస్, కోడం రవీందర్, బూట్ల పరంధాములు, ఇప్పలపల్లి మురళి, అన్నల్‌దాస్ రాంప్రసాద్, బైరి శ్రీకాంత్, ఒగ్గు శంకర్, చేరాల అశోక్, మండల రాజు, వెల్లందడి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన కేటీఆర్

ఎల్లారెడ్డిపేట, మార్చి 10: మల్కపేట రిజర్వాయర్ 9వ ప్యాకేజీ పనులను పూర్తి చేయకుండానే సిద్దిపేట, గజ్వేల్ ప్రాంతాలకు 11, 12వ ప్యాకేజీలను పూర్తి చేసి నీటిని అక్కడికి తరలించుకుపోయారని, ఈ ప్రాంత రైతులను మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ వంచించారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య ఆరోపించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం మాట్లాడుతూ కార్యకర్తల సమావేశంలో కాంగ్రెస్ తెచ్చిన కరువు అని గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను పరిగెత్తించి కొట్టాలని పేర్కొనడం కేటీఆర్ అహంకారానికి నిదర్శనమన్నారు. వానకాలం జూన్‌లో ప్రారంభమవుతోందని, తమ పార్టీ అధికారంలోకి వచ్చింది డిసెంబర్ అన్న విషయం తెలియని అవివేకి కేటీఆర్ అని అన్నారు. అన్నదాతల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సమావేశంలో నాయకులు లక్ష్మారెడ్డి, బుచ్చాగౌడ్, బాబు, రాంరెడ్డి, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

పారా ఒలింపిక్ ఎగ్జిక్యూటీవ్ కమిటీ సభ్యుడిగా రుద్రంగి క్రీడాకారుడు

రుద్రంగి, మార్చి 10 : రుద్రంగి మండల కేంద్రానికి చెందిన సింగారపు బాబు అనే దివ్యాంగ క్రీడాకారుడు పీసీఐ (పారా ఒలింపిక్ కమిటీ ఆఫ్ ఇండియా) సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సింగారపు బాబు మాట్లాడుతూ 2012లో సాధరణ దివ్యాంగ క్రీడాకారుడిగా ప్రయాణం ప్రారంభించిన తనకు పారా ఒలింపిక్ బోర్డులో ఎగ్జిక్యూటీవ్ కమిటీ సభ్యుడిగా ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన సింగారపు బాబు పలు పారా త్రోబాల్ నేషనల్ ఛాంపియన్‌షిప్ పోటీలకు భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించారు. ప్రస్తుతం పారా ఒలింపిక్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా ఎంపిక కావడంతో ప్రజా ప్రతినిధులు, గ్రామస్థులు, నాయకులు సింగారపు బాబుకు శుభాకాంక్షలు తెలిపారు.

బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వకుంటే ధర్నా

సిరిసిల్ల టౌన్, మార్చి 10: బతుకమ్మ చీరలకు ఆర్డర్లు ఇవ్వకుంటే బకాయిలు విడదల చేయకుంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేస్తామని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్ స్పష్టం చేశారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి మాట్లాడారు. నిన్న మొన్నటి వరకు మాతో ఉన్న చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్‌కు బతుకమ్మ చీరలు ఎందుకు ఇప్పుడు చేదయ్యాయో అర్థం కావడం లేదన్నారు. పార్టీలు మారినంత మాత్రాన పథకాల పేరు మారుతుంది కానీ ప్రజలు, కార్మికులు లబ్ధిపొందే కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలన్న స్పృహలేకపోవడం బాధాకరమన్నారు. బతుకమ్మ చీరల ఆర్డర్లు, బకాయిలు ఎప్పుడు ఇస్తున్నారో స్పష్టం చేయలేదన్నారు. ప్రభుత్వం ఏర్పడి 90 రోజులు గడుస్తున్నా నేత కార్మికులు ఎందుకు పస్తులుండాల్సిన పరిస్థితి వచ్చిందని ప్రశ్నించారు. దీనిపై ఆలోచన చేయాలని అన్నాం తప్పా బీఆర్ఎస్ రాజకీయం చేయడం లేదన్నారు. నేత కార్మికులు, పద్మశాలీల అభ్యున్నతికి పాటుపడింది 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ధర్నాకు పిలుపునిచ్చింది రాజకీయం చేయడం కోసం కాదని, కార్మికులను కాపాడుకోవడం కోసమని అన్నారు. బతుకమ్మ చీరలకు ఆర్డర్ ఇచ్చి బకాయి లను విడదల చేస్తే సమస్య పరిష్కారమవు తుందన్నారు. ఫిబ్రవరి మొదటి వారంలో ఆర్డర్ ఇవ్వలేదో నేత కార్మికులపై ప్రేమలేదని అర్థం అవుతుందన్నారు. గత ప్రభుత్వం బతుకమ్మ బకాయిలు విడదల చేయలేదంటూ పదే పదే బీఆర్ఎస్, కేటీఆర్‌ను బదనాం చేయవద్దని, కార్మికులు గమనిస్తున్నారని అన్నారు. పద్మశాలీలను వాడుకొని వదిలేసింది బీఆర్ఎస్ అంటూ కొందరు చేస్తున్న ఆరోపణలను కండించారు. పద్మశాలీల అభివృద్ధికి కృషి చేసిందే బీఆర్ఎస్ ప్రభుత్వమన్నారు. చిన్న ఆలోచనలతో విమర్శలు చేయవద్దని సూచించారు. జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, అర్బన్ బ్యాంక్ చైర్మన్ గడ్డం విఠల్, బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన రవి, ఉపాధ్యక్షుడు ఎండీ సత్తార్, కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్, చేనేత వస్త్ర వ్యాపార సంఘం ఉపాధ్యక్షుడు యేనుగుల ఎల్లయ్య నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు ప్రవీణ్, చక్రపాణి

బండి సంజయ్‌ని విమర్శిస్తే ఓట్లు పడవు

ఎల్లారెడ్డిపేట, మార్చి 10: గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పి అధికారం లేకుండా చేశారని, ప్రస్తుత పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎంపీ బండి సంజయ్‌ని విమర్శిస్తే ఓట్లు పడుతాయని అనుకోవడం ఆ పార్టీ నేతల అవివేకమని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మారెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఆదివారం మాట్లాడుతూ కేసీఆర్, కేటీఆర్ తెలంగాణ వాదాన్ని వాడుకొని పదేళ్ల పాటు పబ్బం గడిపారన్నారు. సిరిసిల్లను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తే కేటీఆర్‌కు మెజార్టీ ఎందుకు తగ్గిందో తెలుసుకోవాలన్నారు. ఎంపీగా బండి సంజయ్ కొవిడ్ సమయంలో పేదల ప్రాణాలను కాపాడిన విషయం గుర్తుంచుకోవాలన్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుంచారన్నారు. బండి సంజయ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైంది కాదన్నారు. మండల కేంద్రంలోని గిద్దె చెరువు, వేణుగోపాలస్వామి ఆలయ నిర్మాణ పనులకు భూమి పూజ చేసి చేతులు దులుపుకున్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు మాట్లాడడం సిగ్గు చేటన్నారు. ఓడిపోతామనే అభద్రతాభావంతో బండి సంజయ్‌పై విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. బీజేపీపై ప్రతి ఒక్కరూ సానుకూలంగా ఉన్నారని, రాబోయే ఎన్నికల్లో బండి సంజయ్ విజయం తథ్యమని లక్ష్మారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. నాయకులు గణేశ్, కిరణ్‌నాయక్, వేణు, దాసు, నర్సయ్య, భాస్కర్‌రెడ్డి, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

చల్మెడను విమర్శించే హక్కు లేదు

వేములవాడ, మార్చి 10: వ్యక్తిగత లాభం కోసం పార్టీ మారిన కౌన్సిలర్లకు చల్మెడ లక్ష్మీనరసింహారావును విమర్శించే హక్కు లేదని వేములవాడ మున్సిపల్ బీఆర్ఎస్ కౌన్సిలర్లు అన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. భారత రాష్ట్ర సమితి పార్టీని మోసం చేసి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థికి ఓటు వేసి వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. పార్టీ ద్రోహానికి పాల్పడిన ఓ నాయకుడి వల్లే ఈ దుస్థితి తలెత్తిందని, శాసనసభ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థికి ఓటు వేయమని కూడా ప్రచారం సరిగా చేయలేదని అన్నారు. వైస్ చైర్మన్ ఎన్నికల్లో కన్నతల్లి వంటి పార్టీకి విరుద్ధంగా ఓటు వేసి మీడియా ముందు పార్టీని, పార్టీ నాయకుడిని విమర్శించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కొడిమ్యాల మండలం నుంచి వచ్చి బీజేపీ నుంచి బీఆర్ఎస్ పార్టీలోకి చేరి ఇక్కడ కౌన్సిలర్‌గా పార్టీ పేరు మీద గెలిచి ఎంత అభివృద్ధి చేశారో వార్డు ప్రజలకు తెలుసునన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, మారం కుమార్, సిరిగిరి రామచందర్, గోలి మహేష్, జోగిని శంకర్, నరాల శేఖర్, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి కందుల క్రాంతి కుమార్, నాయకులు గన్నమనేని రామారావు, పోతు అనిల్ కుమార్, వాసాల శ్రీనివాస్, పర్వేజ్, హింగే కుమార్, లిక్కిడి మహేందర్, రవిచంద్ర గౌడ్, సందీప్, ప్రేమ్ చారి, చిన్న జడల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

పెండింగ్ బిల్లులు, వేతనాలు చెల్లించాలి

సిరిసిల్ల టౌన్, మార్చి 10: కార్మికుల బకాయి బిల్లులు, పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్ అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో యూనియన్ జిల్లా కమిటీ సభ్యుల సమావేశంలో మాట్లాడారు. మధాహ్న భోజన కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలతోపాటు రూ.10వేల వేతనాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర సరుకులను పెంచి మధ్యాహ్న భోజన కార్మికులపై మోయలేని భారాన్ని మోపాయన్నారు. కార్మికుల జీతాలు మాత్రం పెంచడం లేదని ఆరోపించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు సంవత్సరానికి ఒకసారి విద్యార్థులకు మెస్ ఛార్జీలు పెంచాల్సి ఉండగా మూడు సంవత్సరాలైనా పెంచలేదని అన్నారు. పెరిగిన ధరలతో భారంగా మారాయని, ప్రభుత్వం మెస్ ఛార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలనే కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తోందని ఆరోపించారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు రావాల్సిన బకాయి బిల్లులను వెంటనే విడదల చేయాలని, కార్మికుల వేతనాలు పెంచాలని లేని పక్షంలో ఈ నెల 25న సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు రేణుక, రోజా, మణెమ్మ, లక్ష్మన్, రాజు, సత్యం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మన్